ప్రజా సమస్యలు పరిష్కరిస్తేనే నాయకుడిగా గుర్తింపు

- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి పక్కన ఆర్యవైశ్యసంఘం నాయకులు

నల్లగొండ/రామగిరి, డిసెంబర్ 22: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసే వారే నాయకుడిగా గుర్తింపు పొందుతారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బండారు గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన ఆర్యవైశ్య సంఘం జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్లగొండ పట్టణంలో ఆర్యవైశ్య భవన నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా ఎకరం స్థలం అందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడిగా తేలుకుంట్ల చంద్రశేఖర్, మహిళా విభాగం అధ్యక్షురాలి నాంపల్లి భాగ్యలక్ష్మీతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకరం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాలువ సుజాత, ఉప్పల శారద, ఊరె లక్ష్మణ్, లక్ష్మిశెట్టి శ్రీనివాస్, నాళ్ల వెంకటేశ్వర్లు, జయని రాములు, తిరునగరు భార్గవ్, నర్సింహ, వెంకటేశం పాల్గొన్నారు.

అత్యవసర సేవలకు మరో రెండు ఆంబులెన్స్‌లు

- ఎమ్మెల్యే వేముల వీరేశం

108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, డిసెంబర్ 22 : అత్యవసర సేవల నిమిత్తం నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు మరో రెండు ఆంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేతేపల్లి, కట్టంగూర్ మండలాలకు మంజూరైన రెండు ఆంబులెన్స్(108)లను ఆదివారం నకిరేకల్ ప్రభుత్వాసుపత్రిలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆస్పత్రిని త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అనంతరం ఆంబులెన్స్‌ను ఎమ్మెల్యే కొంతదూరం నడిపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చౌగోని రజితాశ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజులా మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, 108 ప్రొగ్రాం మేనేజర్ ఎస్‌కే నజీరొద్దీన్, మెడికల్ ఆఫీసర్లు శ్వేత, అర్చన, ఈఎంఈ మధు, ఈఎండీలు నాగ య్య, సంజీవరెడ్డి, 108 పైలట్లు సోమయ్య, రమేశ్, సమీర్, యాదగిరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్

బ్యాంకు ఉద్యోగులకు బెనిఫిట్స్ అందించేందుకు కృషి

- ఎస్‌బీఐ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్

నల్లగొండ, డిసెంబర్ 22: ఎస్‌బీఐ ఉద్యోగులకు అందాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ అందించేందుకు కృషి చేస్తానని బ్యాంకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ శ్రీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇంద్రారెడ్డి ఫంక్షన్‌హాల్లో ఆదివారం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన ఎస్‌బీఐ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగులు కష్టమర్ల సేవల విషయంలో రాజీ పడవద్దన్నారు. వచ్చే నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. అంతకు ముందు ఉద్యోగులు క్లాక్‌టవర్ నుంచి ఫంక్షన్‌హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో సంఘం రీజినల్ కార్యదర్శి సురిగి నర్సింహగౌడ్, అసిస్టెంట్ రీజినల్ కార్యదర్శి సుమన్ కుమార్, ట్రెజరర్ శాండిల్య, ప్రవీణ్, జగన్ సింగ్ పాల్గొన్నారు.

ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్

సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ, డిసెంబర్ 22: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించి.. ఇప్పటివరకు దానిపై స్పష్టత ఇవ్వకపోవడంతో గ్రామపంచాయతీల్లో పోటీ చేయాలనుకున్న బీసీ అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి గంగాధర్, గోవాడ కిరణ్, అనిల్, సైదులు, రమేశ్, ఉపేందర్, రాంబాబు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

తిప్పర్తి, డిసెంబర్ 22 : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆదివారం తిప్పర్తి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ బి. సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం కండ్లకుంట తండాకు చెందిన లావుడ్యశ్రీను, లావుడ్య సుధాకర్, లావుడ్య నాగరాజు తమ మినీ గూడ్స్ వ్యాన్‌లో 43 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. తిప్పర్తి సెంటర్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా వ్యాన్‌ను నిలిపి తనికీ చేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
I, PARVATANENI SRINIVASA RAO S/O Nagabhushana Rao. R/o. Plot No:101, Himagiri colony Road No:1, DVK Road, Nalgonda 508001. I, have chang my sur name to PARVATHANENI SRINIVASA RAO (New sur name) S/o Nagabhushana Rao.

CHANGE OF NAME
I, KALYANI PARVATANENI W/o Srinivasa Rao. R/o.Plot No:101, Road No:1, Himagiri colony, DVK Road, Nalgonda 508001. I,have chang my sur name to KALYANI PARVATHANENI (New surame) W/o Srinivasa Rao.

EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ యూనిక్ కార్యాలయం
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount
నల్గొండ : 9182777626 | సూర్యాపేట : 9182777635 | చౌటుప్పల్ : 9182777635
హాలియా : 9182777059 | మిర్యాలగూడ : 9182777059

ఉపాధి హామీలో అక్రమాలు

- ఓపెన్‌ఫోరంలో బయటపడినా చర్యలు శూన్యం
- అవినీతికి పాల్పడిన వారికి షోకాజ్ నోటీసులు కూడా ఇవ్వని అధికారులు

ఉపాధిహామీ కార్యాలయం

మర్రిగూడ, డిసెంబర్ 22 : మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనుల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. మండల కేంద్రంలో ఇటీవల జరిగిన ఓపెన్‌ఫోరంలో ఈ విషయం బయట పడింది. గ్రామీణ ప్రాంతాలల్లోని వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు గ్రామాల అభివృద్ధి, స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన ఈ పథకంలో పని చేస్తున్న సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకొని ఈజీఎస్ క్షేత్రస్థాయి సిబ్బంది పలు గ్రామాల్లో పనులు చేయకుండానే ఎంబీలు చేసి డబ్బులను డ్రా చేశారు. ఈ విషయం బయట పడినప్పటికీ ఉన్నతాధికారులు సదరు సిబ్బంది నేటికీ చర్యలు తీసుకోలేదు.

ఓపెన్‌ఫోరంలో వెలుగులోకి

2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులకు గానూ గత నెల 8 నుంచి 13 వరకు గ్రామాల్లో 13వ సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. నవంబర్ 14న స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఎదుట అడిషనల్ పీడీ సమక్షంలో ఓపెన్‌ఫోరం నిర్వహించగా క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. టెక్నికల్ అసిస్టెంట్‌ల నుంచి రూ.94,972, ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి రూ.44,168, పంచాయతీ కార్యదర్శుల నుంచి రూ.47,673, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి రూ.15,053, ఎంపీడీఓ నుంచి రూ.1000, ఏపీఓ నుంచి రూ.3037, ఈసీ నుంచి రూ.3106 లను రికవరీ చేయాలని ఫోరంలో తేల్చారు.

నెలరోజులైనా చర్యలేవి

ఉపాధిహామీలో అక్రమాలు జరిగాయని ఓపెన్‌ఫోరంలో బయటపడి నెలరోజులు గడిచినప్పటికీ సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిబ్బంది రూ.50వేల వరకు అక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు సదరు డబ్బులను రికవరీ చేయాల్సి ఉంది. కానీ ఈజీఎస్ జిల్లా అధికారులు మాత్రం ఓపెన్‌ఫోరం నిర్వహించి చేతులు దులుపుకున్నారే తప్పి చర్యలు తీసుకోలేదు.

ఆదేశాలు రాగానే చర్యలు : ఎంపీడీఓ

ఈ విషయమై ఎంపీడీఓ మున్నయ్యను వివరణ కోరగా ఓపెన్‌ఫోరంలో సిబ్బందిపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన వివరాలను జిల్లా అధికారులు నమోదు చేసుకున్నారు. వారి నివేదిక ఆధారంగా జిల్లా యంత్రాంగం నుంచి ఆదేశాలు రాగానే ఉపాధి హామీలో అవకతవకలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మాలమహానాడు చిట్యాల మండలాధ్యక్షుడిగా వెంకటేశ్

చిట్యాల, డిసెంబర్ 22 : మాలమహానాడు మండల అధ్యక్షుడిగా చిట్యాలకు చెందిన దాసరి వెంకటేశ్‌ను నియమిస్తూ సంఘం జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశ్ ఈ పదవిలో రెండు సంవత్సరాలు కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మాలల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దపాదం కాలినడకన శబరిలమ వచ్చే భక్తులకు 18మెట్ల దర్శనం

రామగిరి, డిసెంబర్ 22: అయ్యప్ప మాల ధరించి పెద్ద పాదం కాలినడకన శబరిమల వెళ్లే భక్తులకు 18 మెట్లద్వారా సన్నిధానం చేరుకుని స్వామివారి దర్శనం చేసుకునే అవకాశాన్ని ట్రావెల్ కోర్ బోర్డు దేవస్థానం కల్పించిందని అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అధ్యక్షుడు రాజుదేశ్వాండే, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెందోట సోము తెలిపారు. ఆదివారం నల్లగొండలోని అయ్యప్ప సేవా సంస్థ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది భక్తులకు ఎంతో ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బజ్జూరి యాదయ్య, బంగారు శిఖరం నిర్వాహకులు పూల గురుస్వామి, దీక్ష గురుస్వాములు పాల్గొన్నారు.

వీల్ చైర్ క్రికెట్‌లో ధరావత్ సురేశ్ ప్రతిభ

ట్రోఫీతో ధరావత్ సురేశ్

తిరుమలగిరి(సాగర్), డిసెంబర్ 22: ఈ నెల 4 నుంచి 6వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన ఉమాంగ్ గౌరవదీప్ నేషనల్ వీల్‌చైర్ క్రికెట్ టోర్నమెంట్‌లో మండలంలోని రంగుండ్ల తండా గ్రామానికి చెందిన ధరావత్ సురేశ్ ప్రతిభ కనబర్చాడు. టోర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్రం జట్టులో ఆడిన సురేశ్ బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి తెలంగాణ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. జాతీయస్థాయి క్రికెట్‌లో ప్రతిభ కనబర్చిన సురేశ్‌ను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

మిర్యాలగూడ రూరల్, డిసెంబర్ 22 : మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన దుండిగాల నాగలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతున్నది. ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్నది. విషయం తెలుసుకున్న రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం నాగలక్ష్మిని పరామర్శించి రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు.

ఆర్థిక సాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్ర స్థాయికి ఎంపికైన వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడిని అభినందించిన కలెక్టర్

దాసరి జయసీల్‌ను అభినందిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ రూరల్, డిసెంబర్ 22: సీఎం కప్ జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నల్లగొండకు చెందిన దాసరి జయసీల్‌ను ఆదివారం జిల్లా కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చి జిల్లాకు పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల, యువజనశాఖ అధికారి నర్సిరెడ్డి, చీఫ్ సెలెక్టర్ ఆష్రఫ్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నాణ్యమైన విద్యను అందించాలి

- డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్

మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

నల్లగొండ/రామగిరి, డిసెంబర్ 22: ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదల డిమాండ్స్ నెరవేర్చాలని కోరుతూ డీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఆమరణ నిరాహార దీక్ష ఆదివారం మూడో రోజు కొనసాగింది. కార్యక్రమంలో పాల్గొన్న విశారదన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి వారి సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి విద్యతో పాటు ఉచిత వైద్యం, ఉపాధి అవకాశం, భూమి కేటాయింపు, ఇంటి నిర్మాణానికి నిధులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, కోకన్వీనర్లు వెంకన్న, గిరి, ఎల్లయ్య, మహేశ్వరాచారి, కృష్ణయ్య, వినోద్, సురేశ్, సుధాకర్, పరమేశ్ పాల్గొన్నారు.

అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

మునుగోడులో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మాలమహానాడు నాయకులు

మునుగోడు, డిసెంబర్ 22 : అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని మాలమహానాడు నేషనల్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు గోలి సైదులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బోగరి విజయ్‌కుమార్, మండలాధ్యక్షుడు చలచీమల యాదగిరి, నాయకులు ఈద శరత్‌బాబు, బెల్లం బాలశివరాజు, పెరుమాళ్ల ప్రమోద్‌కుమార్‌రెడ్డి, యాదగిరి, జంగిలి నాగరాజు, రెడ్డిమల్ల వెంకట్, బేరి రవీందర్, పెరుమాళ్ల ప్రణయ్, రామలింగయ్య పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హాలియా, డిసెంబర్ 22 : హాలియాలోని నాగార్జున ఉన్నత పాఠశాలకు చెందిన 2207-08 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం హాలియాలోని న్యూకిడ్స్ పాఠశాలలో జరుపుకొన్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిట్టిమల్ల శివ, కుంటిగొర్ల రాజశేఖర్, గౌతమ్, మహేశ్, యుగేంధర్, మధు, అశోక్, రమ్య, అరుణ, మౌనిక, సబియ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి సన్మానం

దీపక్‌ను సన్మానిస్తున్న 22వ వార్డు ప్రజలు

మిర్యాలగూడ టౌన్, డిసెంబర్ 22: ఇటీవల హైదరాబాద్ గాడియన్ స్కూల్‌లో జరిగిన అండర్-11 రాష్ట్ర స్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మిర్యాలగూడకు పట్టణానికి చెందిన గోపిశెట్టి దీపక్‌నాయుడు డబుల్స్ విభాగంలో బంగారు పతకం, సింగిల్స్ విభాగంలో రజత పతకాన్ని గెల్చుకున్నాడు. ఆదివారం ఎన్నెస్పీక్యాంపులోని ఇండోర్ స్టేడియంలో దీపక్‌తో పాటు కోచ్ రామకృష్ణను స్థానికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుడు పగిడిమర్రి గోవర్ధనాచారి, స్థానికులు పాల్గొన్నారు.

యువకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నకిరేకల్‌లో ఆపరేషన్ చబుత్ర

- మద్యం సేవించి వాహనం నడిపిన 36 మందిపై కేసు

నకిరేకల్, డిసెంబర్ 22 : ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు డీఎస్పీ శివ రాంరెడ్డి ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలో ఆదివారం రాత్రి పోలీసులు ఆపరేషన్ చబుత్ర ద్వారా తనిఖీలు చేపట్టారు. రాత్రి 12 గంటల నుంచి 2 గంటల వరకూ 120 మంది పోలీసులు పట్టణాన్ని పూర్తిస్థాయిలో జల్లడపట్టారు. అర్ధరాత్రి అకారణంగా రోడ్లపై తిరిగే వారిని, మద్యం సేవించి వాహనాలను నడిపే వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నకిరేకల్ సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ విలేకరులతో మాట్లాడారు. ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్ఐలు పోలీసు సిబ్బందితో కలిసి 10 బృందాలను ఏర్పాటు చేసి పట్టణంలో ఆపరేషన్ చబుత్ర చేపట్టినట్లు చెప్పారు. అకారణంగా రోడ్లపై తిరిగే 123 మంది వాహనదారులను పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇందులో 94 టూవీలర్లు, 9 ఫోర్ వీలర్లు, 5 త్రీ వీలర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. వారిని బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా 36 మంది మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు తేలడంతో అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. టాటా ఏస్ వాహనంలో ఎటువంటి బిల్లులు లేకుండా 12 క్వింటాళ్ల ధాన్యం తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో దొరికిన 100 వాహనాలను సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. వాటిపై ఉన్న పెండింగ్ చలాన్లు, ఇన్సూరెన్స్‌లను పరిశీలించి వాహన యజమాని సరైన ధృవపత్రాలు చూపిస్తే వదిలేస్తామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చిన తర్వాత కేసు నమోదు చేస్తామని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిలో అత్యధికంగా 25 సంవత్సరాల లోపు వాళ్లే ఉన్నట్లుగా డీఎస్పీ చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలు రాత్రి 9 గంటల తర్వాత బయటికి వెళ్తే వారిపై నిఘా ఉంచాలని, మద్యానికి, గంజాయి, మత్తపదార్థాలకు బానిస కాకుండా చూసుకోవాలని సూచించారు. పిల్లలు చెడు అలవాట్లకు బానిసైతే డయల్ 100కు సమాచారం ఇస్తే పోలీసులు వచ్చి కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. ఆయన వెంట సీఐలు కొండల్‌రెడ్డి, రాజశేఖర్, ఎస్ఐ లచ్చిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు పట్టుకున్న బైక్‌లు

చదరంగం ఆట వల్ల మేధో వికాసం

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

చెస్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, డిసెంబర్ 22: చదరంగం ఆట వల్ల పిల్లల్లో బుద్ధి బలం పెరుగుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని రామచంద్రగూడెం ఐఎంఏ కార్యాలయంలో డైమండ్ చెస్ అకాడమీ, అంతర్జాతీయ క్రీడాకారిణి మాశెట్టి దివ్యశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి క్రీడాకారులతో కలిసి చెస్ ఆడారు. పోటీల్లో పాల్గొన్న 80 మంది క్రీడాకారులకు రాజేందర్ కిరాణం యజమాని భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేశ్, నిర్వాహకులు మాశెట్టి శ్రీనివాస్, అంతర్జాతీయ క్రీడాకారిణి అంకితగౌడ్, అరవింద్, లక్ష్మీప్రియ, కౌన్సిలర్ రామకృష్ణ, శాగ జలంధర్‌రెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ సతీశ్‌కుమార్, ఎస్‌వీ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ ఓరుగంటి శ్యాంసుందర్, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులను ఇబ్బంది పెడితే ఊరుకోం

- ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మిర్యాలగూడ, డిసెంబర్ 22: రాజకీయాలను దృష్టిలో పెట్టుకొని ఆర్యవైశ్యులను ఇబ్బందులు పెడితే ఊరుకోబోమని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ హెచ్చరించారు. నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై ఉన్న ఆర్యవైశ్య మహిళా విభాగం నాయకురాలు రాయపూడి భవానికి చెందిన స్థలాన్ని ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సర్వే నం.711లో ఉన్న 22 గుంటల భూమిని 2012లో భవాని కొనుగోలు చేసిందని, దానికి సంబంధించిన డాక్యుమెంట్లు, ఎల్ఆర్ఎస్, ఇంటి నంబర్లు, అనుమతులు ఉన్నాయన్నారు. అందులో ప్రభుత్వ భూమి ఉందని రెవెన్యూ అధికారులు బలవంతంగా ఫెన్సింగ్‌ను కూల్చివేయడంతో రూ.6లక్షల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. నోటీసులు, సమాచారం ఇవ్వకుండా రాజకీయ కక్షతో ఫెన్సింగ్‌ను కూల్చడం సరి కాదన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, సంఘం మహిళా విభాగం ర